# 9

## 'వెధవ డబ్బు'

ఆ అమ్మాయికి పదహారేళ్లుండవచ్చు. అతగాడికి ఇరవైకంటే ఎక్కువ ఉండవు. 'ఈడూ, జోడూ' ఐన దాంపత్యం వాళ్లది. వాళ్లిద్దరూ సాయంకాలం షికారుగా వీధినిపడి పోతున్నారు. ఏవేవో చెప్పుకుంటున్నారు. కిల కిల నవ్వుకుంటున్నారు. తమ మాట లెవరైనా వింటున్నారేమో అన్న సంకోచంకాని, భయం కాని లేనేలేదు వాళ్లకి.

వాళ్ళ మాటలు వెనకాల నడిచివస్తోన్న కనకాచలానికి వినబడుతూనే ఉన్నాయి. ఆ వృద్ధుడు ఆ జంటకొక పది అడుగుల వెనకాల గాలి వాలున ఉన్నాడు.

"చూశావా, వాళ్ళెంత హాయిగా ఉన్నారో! ప్రథమ యవ్వనం తొణికిసలాడుతోన్నప్పుడే హాయి! నీ కేముం దింక? తోంభై యేళ్ల తొక్కవి! యముడు పంపే పెళ్లి గ్రాముకి ఎదురు చూస్తున్నావు! ఈలోగా ఎంత దక్కితే అంతే అని వాళ్ళ పలుకులు విని ఆనందించు." అంటూ గాలి దేవుడు ఆ నూత్న దంపతుల సంభాషణంతా తెచ్చి ఆ ముసిలాయన చెవులకు వప్పగించాడు.

ఆ జంట సందు వదలి రాజవీధిని ప్రవేశించారు. కుడి వైపున ఫర్నిచరు కంపెనీ షోరూము కనపడింది. అద్దాల వెన కాల స్ప్రింగుమంచం, దానిమీద కుషనూ, రకరకాల సోఫాలూ, కుషన్లూ కనపడి ఆకర్షించాయి. ఆ పడక గది ఫర్నిచరు సెట్టు అంతా "రూ. 1216/-" అని అట్ట ముక్కపై వెలవేసి ఉంది. "విత్తంకొద్దీ వైభవం" అంది అమ్మాయి. "మీవాళ్లు కొనివ్వకూడదూ పోనీ?" అన్నా డతడు ఛలోక్తిగా. ఆమెకు కొంచెం కోపం వచ్చి ముఖం ఎర్రబడింది. అతగాడే మళ్లీ, "ఎందుకూ, ఎప్పటికైనా నా కొక పెద్ద ఉద్యోగం కాకపోతుంది గనుకనా? అప్పుడు నేనే కొంటాను!" అన్నాడు.

కనకాచలంగారు, అత డామెకు కోపం రప్పించడం, అంతలోనే సమాధానపరచటం చూసి పొంగిపోయాడు. "చిలకాగోరింకలకు మల్లే ఉన్నారర్రా! చిట్టిచిట్టి తగాయి దాలూ, రాజీనామాలూను! పాపం! మీ కా స్ప్రింగు సామాను మీద మనసుపోయింది కదూ? పెద్ద ఉద్యోగం వస్తే కొంటా

నంటున్నాడు వెఱ్ఱినాయన! ఇప్పు డేదో చిన్న నౌకరీయే అన్న మాట. వీళ్ల మనసు ఎప్పుడైనా తీరుతుందా? పోనీ, నేను ఆ 1216 రూపాయలూ ఇచ్చి, "కొనుక్కోండర్రా!" అంటే యెలాగుంటుంది? నాకు బ్యాంకులో లక్షలకొద్దీ డబ్బు మూలుగుతోందాయిరి. ఏం చేసుకోనూ వెధవడబ్బు? నా అనంతరం తినడానికి ఎవళ్లో లేకపోలేదు. ఐతేం, ఈ పిన్న దంపతు లెవళ్ళో నాకు తెలవకపోయినా, వీళ్ల ఆ కాస్త మనసూ నేను తీరుస్తే వీళ్లెంతో ఆనందిస్తారు. 'ఎవ రీయన? మన ముక్కూ మొహం ఎరక్కపోయినా వెనకాలే వస్తూ మన కోరిక విని తథాస్తు దేవతకు మల్లే ఇట్టే తీర్చేశాడు!' అని ఆశ్చర్యపోతారు. బలే గమ్మత్తుగా ఉంటుం దప్పుడు!" అంటూ కనకాచలంగారు ఆ దంపతులను ఆపబోయాడు. కాని వెంటనే ఆయనఆలోచన మరొక ఫక్కీని వెళ్లింది. "వీళ్లు కష్టార్జితమైన సొమ్ముతో ఈ సామాను కొనుక్కున్నప్పుడు కలిగే ఆనందం నామూలాన ఇలా తేరగా వచ్చి పడితే కలగదు. నా సరదాకొద్దీ వీళ్ళకు డబ్బుయిచ్చి వీళ్లంతట వీళ్ళు సంపాదించుకోవలసిన సంతోషాన్ని మనం చెడగొట్టకూడదు" అంటూ ఆయన తన ఉద్దేశం మార్చుకున్నాడు.

ఆ మిథునం ముందుకు సాగేరు. వాళ్ల కెదురుగా ఒక నావికుల గుంపు వచ్చింది. "ఎవళ్లండీ వీళ్లు? వీళ్ళ డ్రెస్సంతా అదోరకంగా ఉంది" అన్న దామె. "వీళ్లు నావికులు. ఓడల మీాద యుద్ధం చేసేవాళ్లు" అన్నాడాతడు. వాళ్ల సంభాషణ

ఓడలమీదికీ, సముద్రంఅవతల ఉండే దేశాలమీదికీ ద్వీపాల మీదికీ పోయింది. "మొన్న సినిమాలో చూసిన ద్వీప మేదో బాగుందికదండీ? ఆ కొబ్బరితోటలూ, కోతులూ, ఆ కోతులు కథలోని ఆ ప్రేమికులకు కొబ్బరికాయలు పడెయ్యటం చాలా తమాషాగా ఉంది." అన్న దామె. "ఔను. ఆ ద్వీపాలను 'సౌత్ సీ ఐలెండ్లు' అంటారు. వినోదంగా గడపటానికి అక్కడికి ఓడలమీద దేశదేశాలనుంచి వెళ్లుతోంటారు. తెల్లవాళ్ళు కొత్తగా పెళ్ళిచేసుకున్నప్పుడు ఎవళ్ళ జోక్యం లేకుండా స్వేచ్ఛగా ఉండటానికని ఇలాంటి ద్వీపాలకు పోయి కొన్నాళ్లక్కడ గడిపివస్తారు. దాన్నే వాళ్లు 'హనీమూన్'అంటారు." అన్నా డతడు. "మనంకూడా అలా ఏ దీవికైనా వెడితేనో హాయిగా!" అన్న దామె. "నాకూ అలాగే ఉంది మరి. కాని, డబ్బో? ఓడమీద ప్రయాణమంటే బోలెడు డబ్బు కావాలి" అన్నా డతడు.

ఇదంతా కనకాచలంగారి చెవిని పడుతోనే ఉంది. "మీకంటే 'బోలెడు' అనిపిస్తోందికాని ఆ సొమ్ము నాకొక లెక్కలోది కాదర్రా వెఱ్ఱిపిల్లల్లారా! మీకు ఒక ఓడలో మొదటితరగతిటిక్కెట్లు కొనియిచ్చి మీ ప్రయాణం సుఖంగా ఉండేటట్లు యేర్పాటుచెయ్యగలను...కాని ఓడలో మొదటి తరగతి ప్రయాణికులు ఎలాగ ప్రవర్తించాలో, ఆ పద్ధతులూ పంపిణీలూ మీకు తెలుసా మరి? ఇప్పుడంటే పట్నం వచ్చారు కాని మీరు ఏదో ఒక పల్లెలో పుట్టిపెరిగినవాళ్లై యుంటారు. అలాంటప్పుడు మిమ్మల్ని తీసుకుపోయి ఒక గొప్ప స్టీమరులో

ఫస్టుక్లాసు పాస్యెంజర్లమధ్య పడేస్తే వాళ్ళంతా మిమ్మల్ని 'జైతులు' అని హేళనచేస్తారు. మీకు సంతోషం కలిగిద్దా మని పూనుకుంటే చిగురికి మీ కది చెఱపు ఊరుకుంటుంది!... మొదటితరగతికన్న రెండవతరగతి మేలేమో?...అలాగా అనటానికీ వీల్లేదు. కొంచెం తేడాగాని ఆ రెండుతరగతుల మధ్యా అట్టే భేదం లేదు. మూడవతరగతే ఇలాంటివాళ్ళకి సరిపడుతుంది...కాని మూడవతరగతి బొత్తిగా అన్యాయ మేమో? రంగం, మోల్మెయినూ కూలికోసం వెళ్ళే అలగా జనమంతా మూడవతరగతిలో ఎక్కి వెడుతోంటే చూశా నుగా? దానికన్న నరకం వేరే ఉండదు. ఈ నూత్నదంపతులను సుఖంగా, హాయిగా ఇంటిపట్ల ఉండనివ్వక, ఏం పాముకుంటా రనీ ఓడమీద పంపటం?''—ఇలా అనుకొని కనకాచలం ఆ పాపానికి నడికట్టుకోవడం మానుకున్నాడు.

ఆ వృద్ధధనికు డీ నిశ్చయాని కొచ్చేలోగా ఆ దంపతు లేదో మరోగొడవలో పడ్డారు. ఆ కొత్త కోరిక యేమిటో ఆయనచెవిలో పడలేదుకాని అదీ డబ్బుమీద ఆధారపడి ఉన్నదే అని తేలింది. ఏమంటే ఆ యువకుడు తన పడుచుతో, ''అంతా డబ్బుతో ఉందనుకో. 'ధనమూల మిదం జగత్' అని ఊరికే అన్నారా మరి?'' అన్నాడు. ''ఔను; అందుకేగా నేను 'విత్తంకొద్దీ వైభవం!' అంట? డబ్బులేనివాడికి ప్రతీదీ అందని[మా]నిపండే. డబ్బు ఉంటే ఏ సుఖమైనా అరచేతిలో వెన్నముద్ద.'' అని భర్తతో ఏకీభవించిం దామె.

కాని కనకాచలం, ''ఎంత అమాయకులర్రా మీరిద్ద

రూను! డబ్బు సుఖాన్ని కూరుస్తుందిట్రా వెఱ్ఱిమొహాల్లారా! నూరురూపాయల పెట్టుబడితో వ్యాపారం మొదలెట్టిన నాకు ఇప్పుడు కొన్ని లక్షలు మూలుగుతున్నాయి. నే నేం సుఖ పడ్డాను? ధనాన్ని గురించి మీ రిద్దరూ ఇప్పుడు వెల్లడిచేసిన ఆ అభిప్రాయం శుద్ధపొరబాటని నిరూపించటానికి నా కెంతోసేపు పట్టదు. ఎందుకూ? ఒక్క పదివేలరూపాయలు తెచ్చి మీ చేతిలో పోస్తే సరి, ఆ డబ్బుమూలాన ఎన్నెన్ని కీడులు మూడుతాయో మీకే తెలిసొస్తుంది! లేకుంటే కలిగే దుఃఖంకన్న ఉంటే ఉన్న దుఃఖం ఎక్కువదట్రా కుర్రవాళ్లల్లారా. 'డబ్బు, డబ్బో' అంటున్నారు. వెధవడబ్బు! డబ్బు చేరితే సుఖంగా నిద్రకూడా పట్టదు తెలుసా? ఆ పదివేలూ ఇచ్చి మీ సుఖనిద్ర చెడగొట్టమంటారా నన్ను, చెప్పండి? ... ఊహూ! నే నా పాపపుపని చెయ్యను! మానససరోవరంలోని హంసలకు మల్లే హాయిగా ఆనందంలో తేలిపోతున్నారు మీరిప్పుడు. ఇలాగే ఉండండి. డబ్బు లేదని విచారించకండి. వెధవడబ్బు!" అని దాన్ని శపిస్తో, చేయబోయిన ఆ వాగ్దానం రోంతా ఉప సంహరించుకున్నాడు.

ఆమె చేతిలోంచి రుమాలు జారి క్రిందపడింది. ఆమె తీసుకుందామని వెనక్కి తిరిగింది. ఆలోగానే ఆ యువకుడు వంగి దాన్ని తీసి ఆమె కెంతో సొగసుగా అందించాడు. ఆ చిరునవ్వు మొహంలోని సోయగాన్ని చూసి ఆమె, 'ఎంత అందగాడు!' అనుకుంది. బటానీలూ, వేయించిన వేరుశనగ పలుకులూ జంగెడలో పోసి అమ్ముదెస్తూ ఒకడు ఎదురయాడు.

యువకుడు అణావేరుశనగలూ, అణాబటానీలూ కొని ఆమె రుమాలులో పోశాడు. జంగెడవానిచేతిలో అర్ధరూపాయి నాణెం పడేసి మిగతా చిల్లరకై నడుస్తూనే చెయిచాపేడు. జంగెడవాడు చిల్లర ఇచ్చి ముందుకు పోవడంలో దానిలోని ఐదునయాపైసల కాసొకటి యువకుని చేతిలోగాక క్రింద పడిపోయింది. "ఏమిటి, వెతుకుతున్నారు?" అన్నది పడుచు.

"ఐదునయాపైసల నాణెం ఎక్కడో పడింది."

"పోనిద్దురూ, ఐదునయాపైసలే కదా? ఏ ముష్టివానికో దొరికి సంతోషిస్తాడు!" అని ముందంజ వేసింది. అతడూ ఆమె ననుసరించి నడిచాడు.

ఆ వెనకాల యింకా వస్తూన్న కనకాచలానికి ఆ ఐదునయాపైసల నాణెం కనపడింది. అతడు వెంటనే దాన్ని తీసుకుని జేబులో వేసుకున్నాడు!